

చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.10 వేలు, సరాసరిన రూ.15 వేల ప్రకారం ధర పలికాయి.



టమాట కిలో రూ.15
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/ 14.2°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి
అనంతపురం రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు బాలికల గిరిజన సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులు మార్చి 25వ తేదీ లోపు https://aptwgurukulam.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 8309005097 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



బత్తలపల్లి బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

బత్తలపల్లి/ధర్మవరం రూరల్: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులన్నీ కల్పించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన బత్తలపల్లిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను, ధర్మవరం మండలం నిమ్మలకుంట, సీసీ కొత్తకోట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బత్తలపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటాన్ని గమనించి వెంటనే మరమ్మతులు చేయించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌ను ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే డీఈఓ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. అంతకుముందు ఆయన బత్తలపల్లి మండలం దంపెట్ల గ్రామం వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట ధర్మవరం తహసీల్దార్ రమేష్, బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు రాణాప్రతాప్, భరద్వాజ్ బాబు, యోగీశ్వర్‌రెడ్డి, భాస్కర్, విష్ణువర్ధన్ వీఆర్‌ఏలు, బీఎల్‌ఓలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక
గుంతకల్లు: పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 15న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జూనియర్ కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నట్లు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాల బాలికలు 16 సంవత్సరాలు లోపు వయసు ఉండాలని, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జట్లు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

ఆనందానికి హక్కు పత్రం



ఈ చిత్రంలో ఉన్నది బి.శిల్ప, శరత్‌బాబు నాయక్ దంపతులు. ప్రైవేట్ ఉద్యోగం చేసే శరత్‌బాబు బత్తలపల్లిలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. గతంలో ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇంటి స్థలం మంజూరు కాలేదు. కానీ వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక శిల్ప పేరు మీద బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరైంది. దీంతో ఇంటి నిర్మాణం ప్రారంభించారు. ఇటీవలే బత్తలపల్లి-1 సచివాలయంలో ఇంటి స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అద్దె ఇంటి కష్టాలు తప్పడంతో పాటు రూ.లక్షల విలువైన ఆస్తిపై సంపూర్ణ హక్కులు లభించడంతో శిల్ప, శరత్‌బాబు నాయక్ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఈమె పేరు ఎం.ముబీనా. భర్త అన్వర్. ధర్మవరం పట్టణం కొత్తపేటలో నివాసం ఉంటున్నారు. అన్వర్ గుజరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నారు. సొంతిల్లు కట్టుకోవాలన్న ఆశతో గతంలో అర్జీలు పెట్టుకున్నా ఎవరూ స్థలం మంజూరు చేయలేదు. కానీ జగన్ సర్కార్ వచ్చాక సచివాలయంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోగా, వెంటనే జగనన్న కాలనీల్లో పట్టా మంజూరు చేశారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయమూ మంజూరైంది. ఇప్పుడు ఏకంగా వారి పేరుమీదనే ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఇక ఈ ఇల్లు మా హక్కు అంటూ ఆ నిరుపేద కుటుంబం ఎంతో ఆనంద పడుతోంది.



ఎనుములపల్లి సచివాలయంలో ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది

- జిల్లాలో జోరుగా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్
- లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తున్న జగన్ సర్కార్
- ఇప్పటికే 70 శాతం పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి
- 15వ తేదీలోపు వందశాతం చేసేందుకు చర్యలు

ప్రశాంతి నిలయం: ఏ పథకం అమలు చేసినా లబ్ధిదారులకు సంపూర్ణ ప్రయోజనం కలిగేలా జగన్ సర్కార్ కృషి చేస్తోంది. అందులో భాగంగానే నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. ఈ ప్రక్రియ జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో వేగంగా సాగుతోంది. పట్టాలు పొందిన వారంతా మహిళలే కాగా, వారంతా ఇప్పుడు లక్షాధికారులయ్యారు. ఏళ్లుగా నిలువ నీడలేక ఇబ్బందులు పడిన వారంతా...రూ.లక్షల విలువైన స్థలంపై జగన్ సర్కార్ సంపూర్ణ హక్కులు కల్పించడంతో ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.

పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్లు..

జిల్లా వ్యాప్తంగా 589 జగనన్న లేఅవుట్లలో 54,294 మంది పేద మహిళలకు ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. ఇందులో 34,629 పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వీఆర్‌ఓలు, సచివాలయాల సిబ్బంది ఈ నెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. లబ్ధిదారు పేరు, వారికి కేటాయించిన ప్లాట్ల వివరాలతో పాటు ప్లాట్ల సరిహద్దుల ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటికే 21,692 పట్టాలు రిజిస్ట్రేషన్ చేశారు. మరో 12,937 పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 15లోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. రిజిస్ట్రేషన్‌కు గడువు రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో యంత్రాంగం ప్రక్రియను వేగవంగం చేసింది.

జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లు	589
పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు	54,294
పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమి	1,640 ఎకరాలు
పట్టాల రిజిస్ట్రేషన్ లక్ష్యం	34,629
ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పట్టాలు	21,692
రిజిస్ట్రేషన్లు జరుగుతున్న సచివాలయాల సంఖ్య	253

పేదల చేతికి రూ.లక్షల ఆస్తి..

గత ప్రభుత్వాలు ఇళ్ల పట్టాలిచ్చినా హక్కులు లేకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ జగన్ సర్కార్ గత ప్రభుత్వాలకు పూర్తి భిన్నంగా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల విలువైన స్థలం ఇవ్వడంతో పాటు వాటిని రిజిస్ట్రేషన్ చేస్తోంది. అంతేకాకుండా పదేళ్ల తర్వాత అత్యవసర సమయంలో ఆ స్థలం విక్రయించుకునే విధంగా సర్వహక్కులూ కల్పిస్తూ అసైన్ మెంట్ చట్టం చేసింది. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

20 ఏళ్ల కల సాకారమైంది



మా కుటుంబం 20 ఏళ్ల క్రితం కేరళ నుంచి వచ్చి పుట్టపర్తిలో స్థిరపడింది. ఎనుములపల్లి లేఅవుట్‌లో మాకు ఇంటి పట్టా ఇచ్చి ఇల్లు కూడా మంజూరు చేశారు. ఇప్పుడు స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు.

-ధన్యా, పుట్టపర్తి

చాలా సంతోషంగా ఉంది



నా భర్త రవికుమార్ చేనేత కార్మికుడు. సొంతింటి కోసం ప్రభుత్వ సాయం కోసం గతంలో దరఖాస్తు చేసినా ఉపయోగం లేదు. కానీ జగనన్న ప్రభుత్వంలో మాకు రేగాటిపల్లి జగనన్న కాలనీలో ఇంటి పట్టా ఇచ్చారు. దానిపై హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు.

- ఎ.అరుణ, గృహిణి, కొత్తపేట, ధర్మవరం

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



జగనన్న లేఅవుట్లలో పేదలకిచ్చిన పట్టాల రిజిస్ట్రేషన్ ముమ్మరంగా సాగుతోంది. నిర్దేశించిన 34,629 పట్టాల్లో ఇప్పటికే 70 శాతం పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. ఈ నెల 15వ తేదీ లోపు వందశాతం రిజిస్ట్రేషన్లు చేస్తాం.

-పి.అరుణ్‌బాబు, కలెక్టర్

రేపు 'వలంటీర్లకు వందనం'
- జిల్లాలో 9,343 మందికి సన్మానం
- 31 సేవా వజ్ర, 187 సేవా రత్న, 9,125 సేవా మిత్ర అవార్డులు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా నిలుస్తున్న వలంటీర్ల సేవలకు సర్కార్ గుర్తింపు ఇస్తోంది. సేవలకు మెచ్చి ఏటా సన్మానం చేస్తోంది. తాజాగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ఈ నెల 15వ తేదీన పురస్కారాలు అందజేసేందుకు సిద్ధమైంది.

సేవా వజ్రలకు రూ.30 వేల నగదు బహుమతి

జిల్లాలో జిల్లాలో 9,343 మంది గ్రామ/వార్డు వలంటీర్లు పని చేస్తున్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సన్మానించేందుకు సిద్ధమైన ప్రభుత్వం సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్రగా మూడు క్యాటగిరీలుగా విభజించింది. ఈమేరకు అధికారులు 31 మందిని సేవావజ్రకు, 187 మందిని సేవారత్నకు, 9125 మందిని సేవా మిత్ర అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి ప్రశంసాపత్రంతో పాటు పతకాలు అందజేయనున్నారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతిని అందజేయనున్నారు. ఈ ఏడాది పనితీరు ఆధారంగా ప్రభుత్వం కొంతమంది వలంటీర్లకు ప్రత్యేక బహుమతులు అందజేయనుంది. ఇలా ఎంపికైన వారికి అదనంగా మండల, మున్సిపాలిటీ స్థాయిలో రూ.15 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేలు అందజేయనున్నారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి
పుట్టపర్తి అర్బన్: జిల్లాలో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటుకు భూ సేకరణ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో భూ సేకరణపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల కోసం ఇప్పటికే 405 ఎకరాల భూమి సేకరించామన్నారు. ఇందులో ఇప్పటికే 'అదాని' సంస్థ పనులు చేపట్టిందన్నారు. 500 మెగావాట్లు చిత్రావతి పంపు హైడల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు తాడిమర్రి మండలం పెద్దకోట్లలో 24.82 ఎకరాలు కేటాయించినట్లు వెల్లడించారు. రామగిరిలో 300 మెగావాట్లు సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు 8.44 ఎకరాలను ఎస్ఈసీఐ సంస్థకు కేటాయించామన్నారు. ఇంకా ఆయా సంస్థలకు కావాల్సిన భూమిని సేకరించాల్సి ఉందని, ఆ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి
- హిందూపురం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, సభ్యులు లక్ష్మీకాంతరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే ఆస్పత్రుల్లో ఆధునిక సదుపాయాలు కల్పించడంతో పాటు వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి వైద్యుడూ సేవా భావంతో ప్రజలకు సేవలు అందించాలన్నారు. హిందూపురం ఆస్పత్రిలో మౌలిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

వసతుల కల్పనకు ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఆస్పత్రిలో అత్యవసర, తాత్కాలిక, ఐసీయూ, స్పెషాలిటీ వార్డులు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఓపీ శాతం పెరగాలన్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు.

పరికరాల కొనుగోలుకు కమిటీ ఆమోదం

అనంతరం ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచడం, జనరేటర్ల మరమ్మత్తులు, శానిటేషన్ పనులు, ఏపీ వైద్య విధాన పరిషత్, ఎన్‌జీఓల సహకారంతో ఆస్పత్రికి అవసరమైన పరికరాలు కొనుగోలుకు కమిటీ ఆమోదించింది. గత అక్టోబర్ 5వ తేదీన జరిగిన కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్థోపెడిక్ రోగులకు డ్రిల్లింగ్ మిషన్ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యుడు లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సెల్వియా, హెడ్ నర్స్ సొదామున్సి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులకు అందలం!
- టీడీపీలో ఇదీ తీరు
- చర్చనీయాంశమైన 'పోలీసు అధికారి' వ్యవహారశైలి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో టీడీపీ అడ్డదారులు తొక్కుతోంది. ఆ పార్టీ అగ్రనేతలు టికెట్‌కు ఇంతని రేటు నిర్ణయించి వసూళ్లకు దిగారు. పోటీలో ఎక్కువ మంది ఉన్నారంటూ కృత్రిమ డిమాండ్ సృష్టించి..రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు డిమాండ్ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంపైనే 'తమ్ముళ్లు' మండిపడుతుండగా..ఇప్పుడు మరో కోణం వెలుగు చూసింది. టీడీపీలో అవినీతిపరులను సైతం ప్రోత్సహించడాన్ని సొంత పార్టీ నేతలే తప్పుబడుతున్నారు. అసలే అవినీతి మరక ఉన్న పార్టీకి ఇలాంటి వారి వల్ల మరింత చెడ్డపేరు ఖాయమని అంటున్నారు. తాజాగా ఓ డీఎస్పీ స్థాయి అధికారి వ్యవహారం టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. 'పుట్టపర్తి అభ్యర్థిని నేనే. నాకు మద్దతు ఇవ్వండి' అంటున్న సదరు అధికారి వీడియోలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆయనపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో గుప్తనిధుల విషయంలో ఆయన ప్రమేయంపై ఆరోపణలు వచ్చాయి. బోర్‌వెల్స్ విషయంలో రైతుల నుంచి డబ్బులు తీసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. తిరుపతి ట్రాఫిక్ విభాగంలో పనిచేసినప్పుడు కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అలాంటి వ్యక్తి ఒక్కసారిగా టీడీపీ కండువా కప్పుకుని వీడియోలు విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో కొంతమంది ప్రమేయం లేకుండా ఇది జరగదని సొంత పార్టీ నేతలే అంటున్నారు.

అవినీతికి కేరాఫ్ ..

టీడీపీ మొదట్నుంచీ అవినీతికి కేరాఫ్‌గా ఉంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు స్కిల్‌స్కాం కేసులో జైలుకు వెళ్లొచ్చారు. ఇక ఆ పార్టీ అధికారంలో ఉన్న 2014-19 మధ్యకాలంలో టీడీపీ నాయకులు అడ్డగోలు అవినీతికి పాల్పడ్డారు. జన్మభూమి కమిటీల పేరుతో అరాచకం చేశారు. నీరు-చెట్టు పనుల్లో దొరికినంత దోచుకున్నారు. మట్టి, ఇసుక కొల్లగొట్టారు. ఆ పార్టీ నేతల దందాలపై 'పచ్చ'పత్రికల్లోనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు కూడా ఆ పార్టీ అదే తోవలో వెళుతూ అవినీతిపరులను ప్రోత్సహిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధినేత రాకకు ఆతృతగా
- 18న రాప్తాడులో బహిరంగ సభ
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి

రాప్తాడు: ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల కదనరంగంలోనూ అంతే వేగంగా దూసుకుపోతున్నారు. ప్రతిపక్షాలను బెంబేలెత్తిస్తూ ఇప్పటికే సమరభేరి మోగించారు. రాష్ట్రంలో రెండు చోట్ల 'సిద్ధం' సభలు నిర్వహించి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. ఈ క్రమంలోనే రాయలసీమ వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఈనెల 18న రాప్తాడు రానున్నారు. ఆటోనగర్ వద్ద నిర్వహించే 'సిద్ధం' సభలో ప్రసంగించనున్నారు.

వడివడిగా 'సిద్ధం'

సభకు తరలివచ్చి సంక్షేమ సారథికి జేజేలు పలికేందుకు ఒక వైపు పార్టీ శ్రేణులే కాకుండా ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తుండగా.. మరోవైపు వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయడంలో పార్టీ పెద్దలు తలమునకలవుతున్నారు. సభకు లక్షల సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరవుతారని అంచనా ఉన్న నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ నిర్వహణకు కేటాయించిన 110 ఎకరాలను చక్కగా చదును చేస్తున్నారు. సీఎం హెలీప్యాడ్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటి వరకూ 25కి పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు. సభకు హాజరయ్యే కార్యకర్తలకు దగ్గరగా వెళ్లి సీఎం వైఎస్ జగన్ అభివాదం చేయడానికి వీలుగా కిలోమీటరు విస్తీర్ణంతో ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం సభా ప్రాంగణం వద్దే ఉంటూ పనులను పర్యవేక్షిస్తున్నారు.

పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి

'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం



సభా వేదికను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, శంకరనారాయణ, పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో కలిసి పరిశీలించారు. వాహనాల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, సీఎం సభాస్థలి, హెలిప్యాడ్, ట్రాఫిక్, ఇతర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ, ప్రభుత్వ సలహాదారు(విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉరవకొండ, మడకశిర పార్టీ సమన్వయకర్తలు విశ్వేశ్వర రెడ్డి, ఈర లక్కప్ప, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన సభా ప్రాంగణం

విజయవంతానికి సమష్టిగా కృషి
- ఎమ్మెల్యేలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశానిర్దేశం

అనంతపురం టవర్‌క్లాక్: సమష్టిగా ముందుకు సాగి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'సిద్ధం' సభను విజయవంతం చేద్దామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న నిర్వహించే 'సిద్ధం' సభ ఏర్పాట్లు, జన సమీకరణ అంశాలపై దిశానిర్దేశం చేశారు. తరలివచ్చే పార్టీ శ్రేణులకు చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా చూద్దామని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, హిందూపురం పార్లమెంటు పార్టీ సమన్వయకర్త శాంతమ్మ, శింగనమల పార్టీ సమన్వయకర్త వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్‌లో మెరిసిన 'బీరం' విద్యార్థులు



విద్యార్థులతో బీరం కరస్పాండెంట్ సుబ్బారెడ్డి

ఖాజీపేట : జేఈఈ మెయిన్ ఫలితాల్లో బీరం కళాశాల విద్యార్థులు మెరిశారు. 99 శాతానికి పైగా నలుగురు విద్యార్థులు, 98శాతానికి పైగా ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. అందులో వి.సాత్విక 99.62, పి.లక్ష్మీగణేష్ 99.13, జి.నాగదత్తేశ్వరకుమార్ 99.32, పి.కేదార్నాథ్ 99.13, సి.విష్ణువర్ధన్ 98.40, పి.లక్ష్మీభావన 98.00, పి.ప్రియదీపిక 97.01, ఎస్.అఖిల్‌కుమార్ 97.01, హరిధనుష్ 95.61, సుమంత్‌రెడ్డి 95.34 సాయితేజారెడ్డి 95.12 శాతం ఉత్తీర్ణత సాధించారు.

చీనీ తోటకు నిప్పు

ముదిగుబ్బ(ధర్మవరం రూరల్): ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లి రైతు రామిరెడ్డికి చెందిన చీనీ తోటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సర్వే నంబర్ 461లో ఆరేళ్ల క్రితం 950 చీనీ మొక్కలు నాటామని బాధిత రైతు తెలిపారు. పంట కాపు దశకు వచ్చిన సమయంలో పొలం సమీపాన గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, మంటలు చీనీ తోటకు వ్యాపించాయని చెప్పారు. దాదాపు 270 చీనీ చెట్లు పూర్తిగా కాలిపోగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. తోటలో డ్రిప్పు పైపులు, ప్లాస్టిక్ పైపులు, ఎరువు దిబ్బలు సైతం మంటల్లో కాలిపోయాయని చెప్పారు. లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని తోటి రైతులు కోరారు. సచివాలయ ఉద్యాన శాఖ ఉద్యోగి నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు.

మధురమైన ప్రేమ



సందర్భం : నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమ ఒక అనిర్వచనీయమైన అనుభూతి. మాటలకు అందని మధుర భావన. రెండక్షరాలనే కాదు రెండు హృదయాలనూ ఒకటి చేయగల మహత్తర సాధనం. ప్రపంచాన్ని మరచిపోయేటట్టు చేసి గుప్పెడంత గుండెలో గిలిగింతలు పెట్టే తీయని జ్ఞాపకం. అంత గొప్ప ప్రేమను పొందాలని ఎవరైనా అనుకుంటారు. జీవిత గమనంలో అందమైన స్థానం కల్పిస్తూ నిరంతర నవ్వుల పువ్వులలో వికసించాలని ఆనందించే వారి కోసమే 'వాలంటైన్స్ డే' వచ్చి వాలింది. ప్రేమికుల రోజు సందర్భంగా బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని రెస్టారెంట్లలో ఆఫర్లను పెట్టి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు.

– కదిరి/ ధర్మవరం అర్బన్:

అన్యోన్యం.. ఆదర్శం



డాక్టర్లు టీఎం బషీర్, వై సోనియా

ధర్మవరం పట్టణంలోని స్పందన ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ టి.ఎం.బషీర్, డాక్టర్ వై.సోనియా ఇద్దరూ మతాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. ఎంబీబీఎస్ చదువుకునే రోజుల్లోనే వీరిద్దరూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనేవారు. అలా ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకుని ఇష్టపడ్డారు. వీరిలో ఒకరు ముస్లిం కాగా, మరొకరు క్రిస్టియన్. 1995లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె చెరిష్మా, చిన్న కుమార్తె కరిష్మా ఇద్దరూ ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గత 29 సంవత్సరాలుగా డాక్టర్లు ఇద్దరూ సంతోషంగా జీవించడంతోపాటు తోటివారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 'ప్రేమించి పెళ్లి చేసుకోవడం గొప్పకాదు. వివాహ బంధాన్ని జీవితాంతం ఆనందదాయకంగా, అద్భుతంగా మలుచుకోవాలి. ఒకరి అభిప్రాయాలు మరొకరు గౌరవించుకోవాలి. సంసార జీవితంలో ఎదురయ్యే సమస్యలను అర్థం చేసుకుని సర్దుకుపోయినప్పుడే వారి జీవితం బంగారుబాటగా ఉంటుంద'ని డాక్టర్ దంపతులు అంటున్నారు.

ప్రేమకు ప్రతిరూపం ఈ సమాధులు



కదిరిలో ఉన్న చంద్రవదన, మోహియార్‌ల సమాధులు

'ప్రేమ కన్నా దివ్యమైన మాధుర్యం లేదు..ప్రేమ లేని జీవితం ఒక జీవితమే కాదు..ఇద్దరి మనసులు కలిసిన క్షణమే ఒక సుముహూర్తం' అని ఇలా ప్రేమను ఎన్నో రకాలుగా వర్ణిస్తుంటారు. కదిరి పట్టణంలోని ఈద్గాలో ఉన్న చంద్రవదన, మోహియార్‌ల సమాధులను హిందూ,ముస్లింల ఐక్యతకు అలాగే ప్రేమకు ప్రతిరూపంగా కూడా చెప్పవచ్చు. ఇంతకీ వారి యదార్థ ప్రేమ గాథ ఏంటో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మీకోసం..

15వ శతాబ్దంలోని విజయనగర సామ్రాజ్యంలో కదిరి మండలం పట్నంలో రంగరాయలు అనే సామంతరాజు ఉండేవారు. ఆయన ఒక్కగానొక్క కుమార్తె చంద్రవదన. ఈమె ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు విచ్చేసేవారు. అప్పట్లో పర్షియా దేశం నుంచి వజ్రాల వ్యాపారం నిమిత్తం మోహియార్ అనే యువకుడు కదిరికి వచ్చాడు. ఓరోజు తన వజ్రాల దుకాణం ముందు గుండా వెళుతున్న చంద్రవదనను చూసి ఆ యువకుడు ప్రేమలో పడతాడు. ఆమె కూడా అతని ప్రేమలో పడింది. ఇలా రోజూ గుడికి విచ్చేస్తూ దారిలో ఒకరికొకరు చూసుకుంటూ తమ ప్రేమను కొనసాగించేవారు.

ప్రేయసి కోసం కదిరిలోనే..

వజ్రాల వ్యాపారం నిమిత్తం తనతో పాటు పర్షియా దేశం నుంచి విచ్చేసిన వారందరూ తమ దేశానికి వెళ్లిపోగా మోహియార్ మాత్రం చంద్రవదన కోసం కదిరిలోనే ఉండిపోయాడు. కొన్ని రోజులుగా తన ప్రేయసి కన్పించకపోయేసరికి ఓరోజు ఆమెను చూసేందుకు మోహియార్ పట్నం వెళతాడు. అయితే అక్కడున్న రాజభటులు అతన్ని అడ్డుకుంటారు. ఇలా రోజూ వెళ్లడం, వారు అడ్డుకోవడం జరుగుతుంటే చివరకు ప్రేమ పిచ్చోడిగా మారి ఓరోజు ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించేందుకు రాజభటులను ఎదిరిస్తాడు. అతన్ని రాజభటులు బలవంతంగా నెట్టడంతో కిందపడినప్పుడు అక్కడున్న రాయి తలకు బలంగా తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ విషయం తెలిసి చంద్రవదన బోరున విలపిస్తూ తన ప్రియుడి మృతదేహంపై పడి ఆమె కూడా కన్ను మూసింది. ఇది తెలిసి ఆమె తండ్రి రంగ రాయలు తన రాజగురువులు, పెద్దల సలహా మేరకు ఇరువురి మృతదేహాలను కదిరిలోని ఈద్గాలో హిందూ, ముస్లింల సంప్రదాయం ప్రకారం ఒకే చోట ఖననం చేసి వారి ప్రేమకు ప్రతిరూపంగా సమాధులు నిర్మించారు.

పెద్దల మనసు గెలిచారు



చిలమత్తూరు మండలం దాదిరెడ్డిపల్లికి చెందిన గొల్ల సుధాకర్, నాగేశ్వరి ప్రేమించుకున్నారు. వివాహం చేసుకుంటామని పెద్దలకు చెబితే సానుకూల స్పందన రాలేదు. మూడేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా ఒక అమ్మాయి సంతానం కలిగింది. సుధాకర్, నాగేశ్వరిలకు ఒకరిపట్ల ఒకరికి ఉన్న ప్రేమను చూసి ఇరు కుటుంబాల పెద్దల మనసులు కరిగాయి. వారి చల్లని దీవెనలూ లభించాయి.

– చిలమత్తూరు

మాది ప్రేమ'కులం'



హిందూపురంలో నివాసముంటున్న ఎం.నాగమల్లేశ్వరి సీడీపీఓగా, కె.అలీ ముల్లా హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. వీరు 26 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రేమకు కుల మతాలు అడ్డు రావని నిరూపించారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఇరువురు సంతానం. పెద్దకొడుకు తాహీద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె టానియా 9వ తరగతి చదువుతోంది.

– హిందూపురం

ప్రేమ పెళ్లికి పెద్దల పచ్చజెండా



మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన జి.సి.శివకుమార్, జి.స్వర్ణలత ఆరో తరగతి నుంచి బీఈడీ వరకు కలిసి చదువుకున్నారు. బీఈడీ చదివే సమయంలో ఇద్దరి మనసులు కలిశాయి. ప్రేమలో మునిగిపోయారు. పెళ్లి చేసుకుంటామని ఇరు కుటుంబాల్లో పెద్దలకు తెలిపారు. కులాలు వేరయినప్పటికీ పెద్దలు విద్యావంతులు కావడంతో పెళ్లికి పచ్చ జెండా ఊపారు. అలా పెద్దల అంగీకారంతో 2004 జూన్ 16న వివాహం చేసుకున్నారు. కుమారుడు, కుమార్తె సంతానం. ఆనందంగా ఉన్నారు. శివకుమార్, స్వర్ణలత ఎస్జీటీలుగా పనిచేస్తున్నారు.

– మడకశిర రూరల్

ఎల్లో మీడియావి నీచపు రాతలు



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

- జగనన్నతోనే విద్యా సాధికారత
- వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ప్రతుల దగ్ధం

ధర్మవరం: 'జగనన్నతోనే విద్యా సాధికారత' ర్యాలీ విజయవంతం కావడాన్ని టీడీపీతో పాటు ఎల్లో మీడియా జీర్ణించుకోలేకపోయాయని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవాలతో నీచపు రాతలు ప్రచురించిన ఎల్లో మీడియా ప్రతులను మంగళవారం ధర్మవరంలోని కాలేజీ సర్కిల్‌లో దగ్ధం చేశారు. అనంతరం వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల అమర్‌నాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విద్యా సాధికార ర్యాలీకి వేలాదిమంది విద్యార్థులు తరలిరావడంతో టీడీపీలో నిస్తేజం అలుముకుందన్నారు. ప్రజాదరణలో ముందంజలో ఉన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై బురద జల్లాలని ప్రభుత్వానికి విద్యార్థులు వ్యతిరేకంగా మాట్లాడారంటూ ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు వండి వార్చారని మండిపడ్డారు. ప్రతిపక్ష హోదాలో టీడీపీ నాయకులు ప్రజల సమస్యలపై పోరాడాలే తప్ప ఇలా శిఖండి రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజల్లో విశ్వసనీయత లేని ఎల్లో మీడియాకు త్వరలో బుద్ధి చెబుతామన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

ఎల్లో మీడియాలో వచ్చిన అవాస్తవ కథనాలపై టీడీపీ, బీజేపీ నాయకులు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు సవాల్ విసిరారు. నిరుద్యోగులకు జగనన్న ప్రభుత్వం 1.24లక్షల మందికి సచివాలయాల ద్వారా కల్పించిన ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యారంగానికి ఈ నాలుగున్నరేళ్లలో చేసిన రూ.73వేల కోట్ల వ్యయం, చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. అనవసర ఆరోపణలతో ప్రజల్లో చులకన కావొద్దని టీడీపీ, బీజేపీ నాయకులకు హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు పవన్, జయసింహ, నాగార్జున, తేజ, సాయి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ ఫీజు లక్ష్యం రూ.16.84 కోట్లు

- ఆర్జేడీ సమక్షంలో 2024-25 బడ్జెట్‌పై సమావేశం
- ఉమ్మడి జిల్లాకు సూత్రప్రాయంగా టార్గెట్లు!



ఏడీఎంలు, సెక్రటరీలతో సమావేశమైన ఆర్జేడీ రామాంజినేయులు, ఆర్డీడీ శ్రీకాంత్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ ద్వారా ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.16.84 కోట్ల మేర వివిధ రకాల ఫీజులు వసూలు చేయాలని మార్కెట్ కమిటీలకు సూత్రప్రాయంగా టార్గెట్లు ఇచ్చారు. బడ్జెట్ అంశంపై మంగళవారం అనంతపురం మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, లక్ష్మీనారాయణమూర్తి, ఆర్డీడీ బి.శ్రీకాంత్‌రెడ్డితో కలిసి రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజనేయులు సమావేశం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో మార్కెట్ కమిటీలకు ఇచ్చిన టార్గెట్లు, సాధించిన ప్రగతి, ఫీజు వసూళ్లకు ఉన్న అవకాశాలపై చర్చించారు. అలాగే ప్రస్తుతం రెండు జిల్లాల్లో ఉన్న 17 మార్కెట్ యార్డులు, 30 చెక్‌పోస్టుల ద్వారా సాధించిన వసూళ్ల గురించి ఆరా తీశారు. వసూళ్లలో వెనుకబడిన గుత్తి, గుంతకల్లు, పెనుకొండ, తనకల్లు తదితర ఐదారు కమిటీల్లో వచ్చే ఏడాది వసూళ్ల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశనం చేశారు. ఈ ఏడాది రెండు జిల్లాలు 100 శాతం లక్ష్యాలు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో స్వల్ప మార్పులతో వచ్చే ఏడాది టార్గెట్లు కేటాయించారు. అనంతపురం జిల్లాలో ఉన్న 9 కమిటీలకు రూ.11.75 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న ఏడు మార్కెట్ కమిటీలకు రూ.5.09 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు. పశువులు, జీవాల సంతలు, చింతపండు, మిరప, చీనీ మార్కెట్ల విస్తరణ, రైతులకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

'సిద్ధం' సభకు వలంటీర్లుగా ముందుకొచ్చిన విద్యార్థులు



విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

అనంతపురం ఎడ్యుకేషన్: రాప్తాడులో ఈ నెల 18న జరుగనున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభకు రాయలసీమ జిల్లాల నుంచి లక్షలాది మంది పార్టీ శ్రేణులు హాజరుకానున్నారు. ఏ చిన్నలోటుపాట్లు తలెత్తకుండా ఏర్పాట్లకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వలంటీర్లుగా పనిచేసేందుకు విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య నేతృత్వంలో వచ్చిన పలువురు విద్యార్థులతో మంగళవారం సిద్ధం సభాస్థలి వద్ద ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ భేటీ అయ్యారు. వలంటీర్లుగా విద్యార్థులు అందించాల్సిన సేవలపై తలశిల దిశానిర్దేశం చేశారు. జరగబోయే ఎన్నికల యుద్ధంలో విపక్షాలన్నీ కట్టగట్టుకుని జగనన్న ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం మీద, ప్రతి ఇంటికీ మనం చేస్తున్న మంచి, అభివృద్ధి మీద దాడి చేస్తున్నాయన్నారు. పేదోడి బంగారు భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చంద్రబాబు దుష్ట సైన్యాన్ని, వారి కుట్రల్ని, కుతంత్రాల్ని, చీల్చి, చెండాడటానికి, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని తలశిల రఘురామ్ పిలుపునిచ్చారు.

చోళమాంబదేవికి జ్యోతుల ఉత్సవం





అలంకరణలో చోళమాంబదేవి, జ్యోతులు తీసుకెళ్తున్న మహిళా భక్తులు

అమరాపురం: అమరాపురంలో వెలసిన ఐదు గ్రామాల దేవత చోళమాంబదేవి ఉత్సవాల్లో మంగళవారం జ్యోతుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇంటి నుంచి పిండితో తయారు చేసిన కలశాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా చోళమాంబ ఆలయం వద్దకు చేరుకుని, అమ్మవారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని మద్దనకుంట, వీరాపురం, బంగారుపాళ్యం, పుల్లికుంట గ్రామాలతో పాటు అమరాపురం గ్రామం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న డీఎస్పీ..

జ్యోతుల ఉత్సవంలో డీఎస్పీ బాజీ జాన్‌సైదా పాల్గొని, అమ్మవారికి పూజలు చేయించారు. అనంతరం అర్చకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో సీఐ మనోహర్, ఎస్‌ఐ జానార్దన్‌నాయుడు పోలీసులు పాల్గొన్నారు.

ఆరుగురు ఎస్‌ఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆరుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ధరణిబాబును తనకల్లుకు, దిలీప్‌కుమార్‌ను తలుపులకు, డి.శ్రీనివాస్‌ను ధర్మవరం వన్‌టౌన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక తలుపులలో ఉన్న మక్బూల్ బాషాను ఆమడగూరుకు, అక్కడ ఉన్న కె. బాలరామయ్యను కదిరి టౌన్‌కు, తనకల్లులో ఉన్న రాజశేఖర్‌ను పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ తరగతులు

పుట్టపర్తి టౌన్: డిగ్రీ విద్యార్థులు తమ చదువు పూర్తవగానే ఉద్యోగ అవకాశాలు పొందేలా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 9 రకాల షార్ట్ టర్మ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, అమెజాన్‌వెబ్ సర్వీస్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్, డిజిటల్ మార్కెటింగ్, ట్యాలీ, హార్డ్‌వేర్, పైథాన్ కోర్సులలో శిక్షణ ఇస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈ నెల 5 నుంచి 13 ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ సెంటర్లు ఏర్పాటు చేసి శిక్షణ ప్రారంభించామని, 1000 మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారని చెప్పారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.